సాక్షి సూర్యాపేట

మంగళవారం। 2। జూలై। 2024



ఆరుగురి అరెస్ట్

చివ్వెంల మండలానికి చెందిన గర్భిణి సుహాసిని మృతి కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



రాజ్యాంగంతోనే తెలంగాణ..

రాజ్యాంగంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యపడిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం / కనిష్టం

34° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాత పద్ధతిలోనే రైతు భరోసా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి పద్మ

మునగాల: పాత పద్ధతిలో రైతు భరోసా ఇవ్వాలని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు కోరినట్లు జిల్లా సహకార అధికారి(డీసీఓ) ఎస్. పద్మ వెల్లడించారు. సోమవారం మునగాల ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో రైతుభరోసా పథకం అమలుపై నిర్వహించిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతుల అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. సమావేశంలో డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.కృష్ణ, మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్, మండల వ్యవసాయ విస్తరణాధికారులు, సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, గోపిరెడ్డి చెన్నారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా చట్టాలు



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

భానుపురి (సూర్యాపేట) : న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా మోదీ ప్రభుత్వం మూడు కొత్త చట్టాలు తీసుకొచ్చిందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ఆరోపించారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐపీసీ, సీఆర్‌పీసీని తొలగించి వాటి స్థానంలో భారతీయ సంహిత, భారతీయ నాగరికత సురక్ష సంహిత, భారతీయ సాక్ష అధినియమ్ పేరుతో చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ కొత్తచట్టాలను వెంటనే రద్దు చేయాలని, లేదా సమూలంగా మార్పులు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రభుత్వంపై తెలిసీ తెలియక చేసే తప్పులకు కఠినంగా శిక్షించాలన్న ఈ చట్టాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ చట్టాల వల్ల ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోతుందని, రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, నాయకులు ఎస్‌కె.సయ్యద్, పిడమర్తి లింగన్న, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, వజీద్, గులాం పాల్గొన్నారు.

నిబంధనలు తూచ్..

సీఎంఆర్ ధాన్యం అగ్రిమెంట్ అమలులోనే అలసత్వం

- అధికారులు, మిల్లర్లు కుమ్మక్కైనట్లు ఆరోపణలు
- ధాన్యం పక్కదారి పట్టేలా పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు
- 51శాతం దాటని సేకరణ లక్ష్యం



కోదాడ: కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టడానికి పౌరసరఫరాల శాఖ అధికారులు పరోక్షంగా మిల్లర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం అప్పగించినప్పుడు చేసుకున్న అగ్రిమెంట్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తే ప్రతి గింజనూ మిల్లర్ నుంచి వసూలు చేసుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచనచేయడం లేదన్న విమర్శలున్నాయి. సీఎంఆర్ ఇవ్వడంలో జాప్యం చేసిన మిల్లర్లకు కేవలం నోటీసులు ఇవ్వడం వారు అందులోని లొసుగులను ఆసరాగా చేసుకొని కోర్టులకు వెళ్లి అనుకూలంగా ఆర్డర్లు తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. అయినా అగ్రిమెంట్ నిబంధనలు మాత్రం కోర్టు దృష్టికి తేకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కొందరు మిల్లర్లే అధికారుల తీరును తప్పుబడుతున్నారు.

నిబంధనలు ఇలా..

ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యం మరాడించి బియ్యంగా ఇవ్వడానికి ముందు సదరు మిల్లర్‌తో సివిల్ సప్లయ్ అధికారులు ఒప్పందం కుదుర్చుకుంటారు. దీని ప్రకారం సీఎంఆర్ ధాన్యం ఉన్న మిల్లులో ఇతరుల ధాన్యం ఉండకూడదు. ఇతరులకు మిల్లింగ్ చేయకూడదు. ప్రభుత్వం నుంచి వచ్చే ధాన్యం ట్రక్ షీట్‌లను నమోదు చేయడానికి ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లర్ గోదాములో నిల్వ చేయాలి. ధాన్యంలో వచ్చే తరుగుకు, ధాన్యం చెడిపోవడానికి మిల్లరే బాధ్యత వహించాలి. మిల్లర్‌కు సీఎంఆర్ కింద సేకరించి ఇచ్చిన ధాన్యానికి బీమా చేయించాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రభుత్వ ప్రతినిధి వచ్చి రిజిస్టర్లు, స్టాక్‌ను తనిఖీ చేయడానికి మిల్లర్ ఎటువంటి అభ్యంతరం చెప్పకూడదు. మిల్లింగ్ చేసిన బియ్యంలో కేవలం 1 శాతం మాత్రమే నూకలు ఉండాలి. మిల్లింగ్ చేసిన ధాన్యం, బియ్యం వివరాలను ప్రతి సోమవారం జిల్లా అధికారికి పంపించాలి. నిర్ణీత కాలానికి మిల్లింగ్ చేయకపోతే ఆ ధాన్యాన్ని ఇతర మిల్లులకు తరలిస్తే రవాణా ఖర్చులను కూడా మొదటి మిల్లరే భరించాలి. అతన్ని డిఫాల్టర్‌గా ప్రకటించి అతనికి మరోసారి సీఎంఆర్ ధాన్యం కేటాయించకూడదు. మిల్లర్ దించుకున్న ధాన్యానికి సరిపడా చెక్కులు ఇవ్వాలి. ఆ చెక్కులపై సంతకాలను బ్యాంక్ అధికారులచేత ధ్రువీకరించాలి. ఆ ప్రాంత మిల్లర్స్ అసోసియేషన్ అండర్ టేకింగ్ ఇవ్వాలి. అంతే కాకుండా అదే ప్రాంతానిక చెందిన ఇద్దరు రైస్ మిల్లర్ల చేత గ్యారంటీ ఇప్పించాలి. మొదటి మిల్లర్ ధాన్యం, బియ్యం ఇవ్వకపోతే గ్యారంటీ ఇచ్చిన వారి నుంచి వసూలు చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం అమ్ముకున్నా, పక్కదారి పట్టించినా, పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి సీఎంఆర్ కింద ఇవ్వడానికి ప్రయత్నించినా ఎంఆర్ ఆర్డర్ 2015 ప్రకారం క్రిమినల్ చట్టాల కింద చర్యలు తీసుకునే వీలుంది. అగ్రిమెంట్ చేసుకునే సమయంలో ఇన్ని నిబంధనలతో అధికారులు ఒప్పందం చేసుకున్న తరువాత మిల్లర్ బియ్యం ఇవ్వడం లేదని అతని చుట్టూ తిరగడం ఏమిటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని, సంవత్సరాల తరబడి ప్రభుత్వానికి డబ్బులు చెల్లించని మిల్లర్లపై కనీస చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికారులు వారితో కుమ్మక్కవడమే అనేది బహిరంగ రహస్యమే.

బియ్యం సేకరణ 51 శాతం దాటితే ఒట్టు..

2023–24 వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 50 శాతం కూడా సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి ఇవ్వలేకపోయారు. నల్లగొండ జిల్లాలో మాత్రం సేకరణ లక్ష్యంలో 51 శాతం బియ్యాన్ని అధికారులు మిల్లర్ల నుంచి రాబట్ట గలిగారు. ఇక సూర్యాపేట జిల్లాలో 37 శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 48శాతం బియ్యాన్ని సేకరించారు. ఇక 2023–24 యాసంగి సీజన్‌కు సంబంధించి నల్లగొండ జిల్లాలో 32 శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 12 శాతం బియ్యం సేకరించగా సూర్యాపేట జిల్లాలో కేవలం 3 శాతం మాత్రమే బియ్యం సేకరించగలిగారు. తాజాగా ప్రభుత్వం బియ్యంసేకరణ గడువును మరో 90 రోజులు పొడిగించడంతో మిల్లర్ల నుంచి బియ్యం సేకరించడం ఇక ఇప్పట్లో అయ్యే పనికాదని పలువురు అంటున్నారు.

ప్రజా అర్జీలపై తక్షణమే స్పందించాలి



దివ్యాంగురాలి అర్జీని స్వీకరించి ఆమెతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ప్రజావాణిలో అందించే అర్జీలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బీఎస్‌లతతో కలిసి దరఖాస్తులను స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణిలో డివిజన్, మండల స్థాయిలో ప్రజలు వివిధ సమస్యలపై చేసుకున్న దరఖాస్తుల్లో పరిష్కారం కాని దరఖాస్తుదారుడికి ఎందుకు చేయలేకపోయామో వివరాలు తెలపాలన్నారు. వ్యవసాయ సీజన్ మొదలైనందున రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. చివ్వెంల మండలం మున్యానాయక్ తండాకు చెందిన వికలాంగురాలు ధరావత్ పద్మ డబుల్‌బెడ్ రూం ఇంటికోసం దరఖాస్తు తీసుకురాగా కలెక్టర్ స్వయంగా ఆమె వద్దకు వెళ్లి స్వీకరించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 67 దరఖాస్తులు, డీపీఓకు 6, ఇరిగేషన్ 5, డీఆర్‌డీఏ 4, మెడికల్ 4, ఇతర శాఖల దరఖాస్తులు 21 మొత్తం 107 దరఖాస్తులు అందినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్‌కుమార్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, డీపీఓ సురేష్‌కుమార్, సీపీఓ కిషన్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీటీడీఓ శంకర్, డీఈఓ అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించడంలో రాజీపడొద్దు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీల్లో చేపట్టే పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మున్సిపాలిటీల్లో చేపట్టే అభివృద్ధి పనులపై సోమవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 3వ తేదీన రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేయాలన్నారు. కోదాడకు రూ.20 కోట్లు, హుజూర్‌నగర్‌కు రూ.10 కోట్లు, నేరేడుచర్లకు రూ.5 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. రూ.8కోట్లతో మినీ ట్యాంక్‌బండ్, రూ.6కోట్లతో కోదాడ టౌన్‌హాల్, రూ.50 లక్షలతో ముఖద్వారాలు, రూ.4.4 కోట్లతో చెర్వుకట్ట బజారు నుంచి అనంతగిరి రోడ్డు వరకు మేజర్ ఔట్‌ఫాల్ డ్రెయిన్ పనుల్లో రాజీపడకుండా చేపట్టాలన్నారు. సమావేశంలో కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్లు రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఈఈ జీకేవీ ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేలుకు నిరసన సెగ



బొల్లంపల్లి స్టేజీ వద్ద హైవేపై ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు వచ్చి బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు

అర్వపల్లి: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుకు కాంగ్రెస్ శ్రేణుల నుంచి నిరసన సెగ తగిలింది.ఎమ్మెల్యే పర్యటనకు సంబంధించిన సమాచారాన్ని తమకు ఇవ్వడంలేదని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసనకు దిగాయి. సామేలు సోమవారం తన పర్యటనలో భాగంగా తుంగతుర్తి నుంచి అర్వపల్లికి వస్తుండగా బొల్లంపల్లిస్టేజీ వద్ద హైవేపై కాన్వాయ్‌ని అడ్డుకోవడానికి యత్నించారు. అలాగే అర్వపల్లి వైజంక్షన్‌లో ఎమ్మెల్యే సామేలు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఆస్తులు అమ్మి సామేలును ఎమ్మెల్యేగా గెలిపిస్తే పర్యటన సమాచారం మండల, గ్రామ కమిటీలకు ఇవ్వడంలేదన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపించారు. తప్పని పరిస్థితుల్లో నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకోకుండా చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, యూత్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ పాల్గొన్నారు.



అర్వపల్లిలో నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

డీసీసీబీ.. కాంగ్రెస్ వశం

చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక

- ఎన్నికకు హాజరైన 15 మంది డైరెక్టర్లు
- గైర్హాజరైన బీఆర్‌ఎస్ డైరెక్టర్లు
- నూతన చైర్మన్‌ను అభినందించిన మంత్రి కోమటిరెడ్డి



డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రి కోమటిరెడ్డి, వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం డీసీసీబీ సమావేశ మందిరంలో చైర్మన్ పదవికి జిల్లా సహకార అధికారి (డీసీఓ) కిరణ్‌కుమార్ ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు జరిగిన ఈ ఎన్నికకు 19 మంది డైరెక్టర్లకు గాను, కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డితోపాటు మరో 13 మంది డైరెక్టర్లు హాజరయ్యారు.ఇక బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు ముగ్గురు బీఆర్‌ఎస్ డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీఓ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న శ్రీనివాసరెడ్డి.. రాజగోపాల్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశీస్సులతో ఇప్పుడు డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

ఒక్కటి నుంచి 15కు పెరిగిన కాంగ్రెస్ బలం..

ఏడాది కిందటి వరకు డీసీసీబీలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఒకేఒక్క డైరెక్టర్‌గా శ్రీనివాసరెడ్డి మాత్రమే. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత డీసీసీబీలో కాంగ్రెస్ బలం పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 8 మంది డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేశారు. రెండు నెలల కిందట డీసీసీబీ వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బ్యాంకులో కాంగ్రెస్ బలం 10 కాగా, ప్రస్తుతం చైర్మన్ ఎన్నిక నాటికి 15కు చేరుకుంది. అందులో బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు డైరెక్టర్లు ఇప్పుడు శ్రీనివాసరెడ్డికి మద్దతు తెలపడంతో వారు కూడా కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరినట్లయ్యింది.

సీట్లో కూర్చోబెట్టిన మంత్రి కోమటిరెడ్డి

డీసీసీబీ నూతన చైర్మన్‌గా ఎన్నికై న కుంభం శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూలమాల, శాలువాలతో సత్కరించి చైర్మన్ సీట్లో కూర్చోబెట్టి అభినందనలు తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ పదవి ముఖ్యం కాదని, రైతులకు సేవచేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రైతుబిడ్డలకు విరివిగా విద్యా రుణాలను ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. అనంతరం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, బ్యాంకు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బ్యాంకు సీఈఓ శంకర్‌రావు, బ్యాంకు డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, అందెల లింగంయాదవ్, గుడిపాటి సైదులు, జయరాం, కోడి సుష్మ, అంజయ్య, శ్రీనివాస్, కొండ సైదయ్య, ఎస్.అనురాధ, జూలూరి శ్రీనివాస్, కె.వీరస్వామి, కరుణ, రామచంద్రయ్య, పలువురు కాంగ్రెస్ నేతలు, బ్యాంకు సిబ్బంది, అధికారులు తదితరులు కుంభం శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.


రైతు సంక్షేమమే ధ్యేయం

– డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. రైతులకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డైరెక్టర్లు, ఉద్యోగుల సమష్టి సహకారంతో బ్యాంకును లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు.

ముగిసిన బదిలీలు, పదోన్నతులు

- 2,293మంది ఉపాధ్యాయులకు స్థానచలనం, పదోన్నతులు
- జూన్ 6 నుంచి ప్రారంభమైన ప్రక్రియ
- చివరి రోజు ఎస్‌జీటీల బదిలీలు
- ఆయా పాఠశాలల్లో చేరిన టీచర్లు



సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. గత నెల 6వ తేదీన ప్రారంభమైన ఈప్రక్రియ సోమవారంతో పరిసమాప్తం అయ్యింది. జిల్లాలో మొత్తం 3,700 మంది ఉపాధ్యాయులకు గాను 2,293మందికి బదిలీలు, పదోన్నతులు లభించాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తమకు పదోన్నతులు, బదిలీలు రావడంతో చాలా సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మొదట ఎస్‌ఏలకు జీహెచ్‌ఎంలుగా..

మొదట స్కూల్ అసిస్టెంట్‌లు జీహెచ్ఎంల కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్‌లు పెట్టుకున్నారు. సీనియారిటీ జాబితా ఆధారంగా వారికి పదోన్నతులు లభించాయి. అనంతరం స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీల ప్రక్రియను చేపట్టారు. ఆ తర్వాత ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్లు పొందారు. చివరగా ఎస్‌జీటీలకు బదిలీలు జరిగాయి. వారందరూ ఆయా పాఠశాలల్లో జాయిన్ అయ్యారు.

709 మందికి ప్రమోషన్

జిల్లాలో మొత్తం 3700 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో 2,293 మందికి వారు పని చేస్తున్న ఆయా పాఠశాలల నుంచి వేరే పాఠశాలలకు బదిలీలు, పదోన్నతులు లభించాయి. ఇందులో ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా 641 మందికి ప్రమోషన్, 912 ఎస్‌జీటీల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్ఎంగా 68మంది, అలాగే 672 మంది స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీలు జరిగాయి. మొత్తం 709 మందికి ప్రమోషన్ వచ్చింది. జూన్ 6వ తేదీ నుంచి ప్రక్రియ కొనసాగింది. మొదటగా జీహెచ్ఎంల ప్రక్రియ కొనసాగగా 102 మందికి జీహెచ్ఎంలుగా పదోన్నతి పొంది ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఇందులో జిల్లాలో 68 మంది స్కూల్ అసిస్టెంట్‌లకు జీహెచ్ఎంలుగా పదోన్నతి రాగా అందులో ఇద్దరు ఇతర జిల్లాలకు ప్రమోషన్‌పై వెళ్లారు. ఇంకా 33 మంది జీహెచ్ఎంలు ఇతర జిల్లాల నుంచి సూర్యాపేట జిల్లాకు వచ్చారు. అలాగే 672 మంది స్కూల్ అసిస్టెంట్‌లు వారు పని చేస్తున్న పాఠశాలల నుంచి ఇతర స్కూళ్లకు బదిలీలపై వెళ్లారు.

బదిలీల ప్రక్రియ పూర్తయింది

పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత చాలా వరకు సమసిపోయింది. ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కడైనా ఉపాధ్యాయుల కొరత ఉంటే సర్దుబాటు చేస్తాం.

–అశోక్, డీఈఓ

641మంది ఎస్‌జీటీలకు పదోన్నతులు..

జిల్లాలో 641 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు లభించాయి. ఇందులో 16 మంది ఎస్‌జీటీలు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల పరిధిలో పని చేస్తున్నారు. లోకల్ బాడీలో 625 మందిలో 320 మంది ఎస్‌జీటీలుండగా 305 మంది అప్‌గ్రేడ్ అయిన తెలుగు పండిట్, హిందీ పండిట్, పీఈటీలు ఉన్నారు. వీరికి ఎస్ఏలుగా పదోన్నతులు రాగా పాఠశాలల్లో చేరారు. శని, ఆదివారాలు ఎస్‌జీటీల బదిలీలు కొనసాగాయి. ఆదివారం సాయంత్రం వరకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. సోమవారం 912 మంది ఎస్‌జీటీలకు బదిలీల ఆర్డర్లు ఇచ్చారు. వీరు రిలీవ్ అయి ఇతర స్కూళ్లకు వెళ్లారు.

సుదీర్ఘ కసరత్తు..

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ అధికారులు సుదీర్ఘమైన కసరత్తు చేశారు. తొలుత సబ్జెక్టుల వారీగా అర్హులైన జీహెచ్‌ఎంలతో కమిటీలు ఏర్పాటు చేశారు. పదోన్నతులకు దరఖాస్తు చేసిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. సీనియారిటీ జాబితాలు రూపొందించి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. సవరణలకు అవకాశం కల్పించారు. తుది జాబితాను సీఎస్‌సీకి పంపించగా ఆమోదం లభించింది. ఆన్‌లైన్‌లో కౌన్సిలింగ్ చేపట్టి పదోన్నతులు పూర్తి చేశారు. సీనియారిటీ, ఇతర అంశాల ప్రాతిపదికన రోస్టర్ పాయింట్లు కేటాయిస్తూ ముందడుగు వేశారు. డీఈఓ అశోక్ నేతృత్వంలో సిబ్బంది శ్రమించారు. 25రోజులుగా పని చేస్తూ ప్రక్రియను పూర్తి చేశారు. సుమారు తొమ్మిదేళ్లుగా కోర్టు కేసుల కారణంగా పదోన్నతి లభించని ఎంతో మంది ఉపాధ్యాయులు ఇన్నాళ్లకు కలనెరవేరడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది

భానుపురి (సూర్యాపేట) : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, ప్రజల ప్రాణాలు కాపాడేందుకు 24గంటలు అందుబాటులో ఉండే నిజమైన హీరోలు డాక్టర్లు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని కిరాణ ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ డాక్టర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి జె.నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సుమన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

మెడికల్ కళాశాల ఎదుట విద్యార్థుల ధర్నా



సూర్యాపేటలో మెడికల్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న అలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన బోధన సిబ్బంది లేరని, అసంబద్ధమైన సిలబస్‌తో పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఫెయిల్ చేశారని కాళోజీ యూనివర్సిటీ అధికారులపై మండిపడ్డారు. గ్రేస్ మార్కులు కలిపి పాస్ చేయాలని డిమాండ్ చేశారు.

ట్రావెల్స్ బస్సులో రూ.12లక్షలు అపహరణ

కొత్త చట్టం బీఎన్ఎస్ ప్రకారం తొలికేసు నమోదు

చివ్వెంల(సూర్యాపేట): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టం ప్రకారం సోమవారం చివ్వెంల పోలీస్‌స్టేషన్ పరిధిలో తొలికేసు నమోదైంది. వల్లభాపురం గ్రామ శివారులో సాయిక్రిష్ణ హోటల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ట్రావెల్స్ బస్సులో రూ.12 లక్షలు అపహరించిన ఘటనలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)చట్టం ప్రకారం 303(2) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. విజయవాడకు చెందిన మోహిని ప్రియ అమెరికా నుంచి విజయవాడలో ఉంటున్న తన తల్లిదండ్రులకు హైదరాబాద్‌లోని కన్సల్టెన్సీ ద్వారా రూ.12 లక్షలు పంపించింది. ఈ నగదును విజయవాడకు చెందిన కొల్లి శివకుమార్.. మోహిని ప్రియ తల్లిదండ్రులకు ఇచ్చేందుకు బ్యాగులో సర్దుకుని హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే దాసరి ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. సోమవారం తెల్లవారుజామున చివ్వెంల మండల వల్లభాపురం శివారులోని సాయిక్రిష్ణ హోటల్ వద్ద బస్సు ఆపడంతో శివకుమార్ మూత్ర విసర్జనకు బస్సు దిగి తిరిగి వచ్చేసరికి డబ్బులు కనిపించలేదు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బీఎన్ఎస్ చట్టం ప్రకారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

బస్సులో నుంచి దిగుతుండగా కిందపడి గాయాలు

డిండి: బస్సు దిగుతుండగా కాలుజారి కిందపడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న పి. నరసింహ సోమవారం నల్లగొండ నుంచి బస్సులో డిండికి బయల్దేరాడు. ఈ క్రమంలో డిండి పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఆయన బస్సు దిగుతుండగా.. కాలుజారి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కళాశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నరసింహను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



మృతిచెందిన పాడి గేదె

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామ శివారులో సోమవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. మొల్కపట్నం గ్రామానికి చెందిన కడకండ్ల చినరాములు తన పాడి గేదెను రోజు మాదిరిగానే సోమవారం మేతకు తోలుకెళ్లగా.. గ్రామ శివారులోని గోదాం సమీపంలో విద్యుత్ స్తంభం స్టే వైర్ గేదెకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పేరెల్లి నగేష్ ఘటనా స్థలం వద్దకు వెళ్లి బాధితుడిని పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు.

సిరిపురంలో వానరానికి అంత్యక్రియలు



కోతికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న యువకులు

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామంలో సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వానరం(కోతి) మృతిచెందింది. మృతిచెందిన వానరానికి స్థానిక యువకులు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కారోబార్ తుంగ యాదగిరి, మాజీ వార్డు సభ్యుడు పగుడాల శివగణేష్, గాదె సాయిలు, సిలువేరు సురేష్, బల్గూరి అంబేడ్కర్, కంకల మల్లేష్, కూరెళ్ల ఉపేంద్రాచారి మోటె సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

బీబీనగర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారు. పాఠశాలలోని వంట గది తాళాలను పగులగొట్టి అందులోని వంట సామగ్రితో పాటు సరుకులను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది చోరీ జరిగినట్లు గుర్తించారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిర ప్రేమజ్యోతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

‘అబార్షన్’ కేసులో ఆరుగురి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, చిత్రంలో డీఎస్పీ తదితరులు

సూర్యాపేటటౌన్: తమకు పుట్టబోయేది ఆడపిల్ల అని తెలుసుకుని తన భార్యకు అబార్షన్ చేయించి ఆమె మృతికి కారణమైన భర్తతో పాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాముతండాకు చెందిన బట్టు కృష్ణ, క్రాంతి దంపతుల కుమార్తె సుహాసినికి, సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఎంజీనగర్ తండా చెందిన రత్నావత్ హరిసింగ్‌కు ఇచ్చి 2019లో వివాహం చేశారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత సుహాసిని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటానని చెప్పగా.. ఆమె భర్త హరిసింగ్, బంధువులు కలిసి వారసుడు కావాలని ఆపరేషన్ చేయించుకోవద్దని హెచ్చరించారు. మగ పిల్లవాడు లేకపోతే వేరే పెళ్లి చేసుకుంటానని హరిసింగ్ బెదిరించడంతో సుహాసిని భయంతో ఆపరేషన్ చేయించుకోలేదు. సుహాసిని మూడోసారి గర్భం దాల్చగా భర్త హరిసింగ్, అతడి బంధువులు కోదాడలోని డాక్టర్ గుర్వయ్య హాస్పిటల్‌కు తీసుకెళ్లి స్కానింగ్ చేయించగా కడుపులో ఆడపిల్ల ఉందని చెప్పారు. దీంతో జూన్ 24న హరిసింగ్ సుహాసిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇద్దరు పిల్లలను ఆమెకు అప్పగించి, అదే రోజు హుజూర్‌నగర్‌లోని న్యూకమలా హాస్పిటల్‌కు తీసుకెళ్లి అక్కడ ఆస్పత్రి మేనేజర్ ఖాసీంతో సుహాసినికి అబార్షన్ చేయించేందుకు మాట్లాడుకున్నారు. మరో ప్రైవేట్ ఆస్పత్రి నర్సు ద్వారా టాబ్లెట్స్ పెట్టించారు. అయితే ఈ విషయం విలేకరులకు తెలిసిందన్న సమాచారంతో ఖాసీ మరునాడు ఉదయం సుహాసినిని పెద్దవీడు గ్రామానికి తీసుకెళ్లి అక్కడ తన ఇంట్లో ఉంచి అక్కడకు ఆ నర్సును పిలిపించి సుహాసినికి అబార్షన్ అయ్యేందుకు టాబ్లెట్ పెట్టించారు. టాబ్లెట్స్, ఇంజక్షన్ల వలన సుహాసినికి బ్లీడింగ్ ఎక్కువై అబార్షన్ కాలేదు. దీంతో వెంటనే ఆపరేషన్ చేయాలని ఖాసీ కారులో సుహాసినిని మఠంపల్లికి, అటునుంచి కోదాడకు తీసుకెళ్లి డాక్టర్ గుర్వయ్య హాస్పిటల్‌లో చేర్పించారు. జూన్ 26న ఉదయం డాక్టర్ గుర్వయ్య వచ్చి సుహాసినికి స్కానింగ్ చేసి సీరియస్‌గా ఉందని చెప్పడంతో అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రశాంతి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడ వైద్యులు తమ వల్ల కాదని చెప్పడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా.. సూర్యాపేట సమీపంలోకి రాగానే సుహాసిని పరిస్థితి మరింత విషమంగా మారడంతో సూర్యాపేటలోని రాంమూర్తి ఆస్పత్రికి తీసుకరాగా పరీక్షించిన డాక్టర్ ఆమె అప్పటికే మృతి చెందినట్లు చెప్పాడు. వెంటనే సుహాసిని మృతదేహాన్ని ఎంజీనగర్ తండాకు తీసుకొని వెళ్లారు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మృతిరాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతురాలి భర్త హరిసింగ్, హుజుర్‌నగర్‌లోని న్యూకమలా హాస్పిటల్ మేనేజర్ షేక్ ఖాసీం, నర్సు దేవరకొండ రాణి, కోదాడ విజయ ఆస్పత్రి కాంపౌండర్‌లు రణపంగు గోపి, షేక్ సైదులు, ఆర్‌ఎంపీ డాక్టర్ అమరగాని నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మొత్తం 16మంది వరకు ఉన్నట్లు గుర్తించామని, మిగతా వారు పరారీలో ఉన్నారని ఎస్పీ పేర్కొన్నారు. పూర్తిస్థాయి కేసు విచారణ అనంతరం అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసును డీఎస్పీ జి. రవి ఆధ్వర్యంలో వెంటనే ఛేదించిన సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, రత్నం, వెంకన్నను ఎస్పీ అభినందించారు.

వైద్యం కోసం వృద్ధుడి పడిగాపులు

- తేలుకాటుకు గురై పీహెచ్‌సీకి వచ్చిన వృద్ధుడు
- అప్పటికే పీహెచ్‌సీ మూసివేసిన సిబ్బంది
- సమాచారం ఇచ్చి గంటకు పైగా వేచిచూసినా రాని వైద్య సిబ్బంది
- పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించిన కుటుంబ సభ్యులు



శాలిగౌరారంలో పీహెచ్‌సీ ముందు బెంచీపై తేలుకాటుకు గురైన వృద్ధుడు

శాలిగౌరారం: తేలుకాటుకు గురై పీహెచ్‌సీకి వెళ్లిన వృద్ధుడు పీహెచ్‌సీ మూసి ఉండడంతో అక్కడే పడిగాపులు కాచాడు. గంట దాటినా వైద్య సిబ్బంది రాకపోవడంతో పరిస్థితి విషమించడంతో ఆ వృద్ధుడిని కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గుండ్ల రాజయ్య(65) సోమవారం రాత్రి 8 గంటలకు తన ఇంటి వద్ద తేలుకాటుకు గురయ్యాడు. దీంతో వృద్ధుడిని కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. కానీ అప్పటికే పీహెచ్‌సీని మూసివేసి సిబ్బంది వెళ్లిపోయారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు మండల వైద్యాధికారితో పాటు పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి ఫోన్‌లో సమాచారమందించారు. గంటసేపు పీహెచ్‌సీ బయట బెంచీపైనే వృద్ధుడు పడుకున్నాడు. ఎంతసేపటికీ ఏఒక్కరూ కూడా పీహెచ్‌సీకి రాకపోగా.. వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. ప్రభుత్వం ఆర్‌ఎంపీల వైద్యం విషయంలో దాడులు చేస్తుండటంలో వృద్ధుడికి వైద్యం చేసేందుకు ఆర్‌ఎంపీ నిరాకరించాడు. దీంతో నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు వెంటనే వృద్ధుడికి వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై బాధితుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఇదిలా ఉండగా జూన్ 19న రాత్రి అడ్లూరు గ్రామానికి చెందిన ఓ మహిళ కూడా తేలుకాటుతో వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తే పీహెచ్‌సీ మూసివేసి ఉండటంతో ఆమెను నకిరేకల్‌కు తరలించారు. జూన్ 21న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేయగా.. సిబ్బంది లేకపోవడంతో ఆయన వైద్య సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా సిబ్బంది పనితీరులో మాత్రం మార్పురాలేదు.

చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రవీందర్‌నాయక్

నేరేడుచర్ల: చోరీలకు పాల్పడుతున్న దొంగను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన తాళ్లూరి కనకాచారి మిర్యాలగూడలో పట్టణంలోని సీతారాంపురంలో నివాసముంటున్నాడు. హుజూర్‌నగర్‌లోని ఓ పాత ఇనుప సామాను షాపులో జూన్ 29వ తేదీన కనకాచారి చోరీకి పాల్పడ్డాడు. సోమవారం నేరేడుచర్లలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వస్తున్న కనకాచారిని ఆపి విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.25వేలతో పాటు మిర్యాలగూడ, సరూర్‌నగర్‌లో దొంగిలించిన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. నిందితుడిని హుజూర్‌నగర్ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారని తెలిపారు. నిందితుడిపై మిర్యాలగూడ వన్‌టౌన్, సరూర్‌నగర్‌లో పలు కేసులు నమోదు అయినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హుండీలోని నగదు చోరీ

పెన్‌పహాడ్: మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో గల శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి దుండగులు చొరబడి హుండీలోని నగదు ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ నిర్వాహకులు రెండు హుండీలు ఏర్పాటు చేయగా.. దుండగులు ఒక హుండీని పగులగొట్టి అందులోని డబ్బులు ఎత్తుకెళ్లారు. దేవాలయ నిర్వాకుడు రౌతు లింగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో చదవడం ఇష్టంలేక..

- పురుగుల మందు తాగిన బాలిక

చందంపేట: ఆశ్రమ పాఠశాలలో చదవడం ఇష్టంలేక ఓ బాలిక పురుగుల మందు తాగింది. ఈ ఘటన చందంపేట మండలంలోని తెల్దేవర్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో సోమవారం జరిగింది. పెద్ద అడిశర్లపల్లి మండలం అంగడిపేట గ్రామానికి చెందిన దుర్గయ్య, సరిత దంపతుల కుమార్తె స్వాతిని చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతిలో చేర్పించేందుకు ఆమె తండ్రి సోమవారం తీసుకొచ్చాడు. అయితే, ఆశ్రమ పాఠశాలలో చదవడం ఇష్టంలేని స్వాతి.. తన తండ్రి పాఠశాలకు తీసుకొచ్చే క్రమంలో తన బ్యాగులో క్రిమిసంహారక మందు తెచ్చుకుంది. పాఠశాలకు వచ్చిన తర్వాత అక్కడే క్రిమిసంహారక మందు తాగింది. ఇది గమనించిన పాఠశాల నిర్వాహకులు హుటాహుటిన ఆమెను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

ఎనిమిది మంది బైండోవర్

చౌటుప్పల్: మండలానికి చెందిన ఎనిమిది మందిని సోమవారం బైండోవర్ చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. వివిధ పాత కేసులకు సంబంధించిన వీరిని తహసీల్దార్ హరికృష్ణ ఎదుట బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూర్‌నగర్: విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతిచెందాడు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం రాయినిగూడేనికి చెందిన ఉల్వలపురి నరసింహరావు(40) భవన నిర్మాణ కార్మికుడిగా, మార్బుల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. జూన్ 29న హుజూర్‌నగర్ పట్టణంలోని చింతకాయల కోటయ్య ఇంట్లో నరసింహరావు మార్బుల్ బండలను మిషన్‌తో పాలిష్ చేస్తుండగా మిషన్ హ్యాండిల్‌కు కరెంట్ సరఫరా అయ్యి విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. దీంతో అతడిపై మిషన్ పడి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య రజిత చ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్టు షాపులకు తరలిస్తున్న మద్యం పట్టివేత

చౌటుప్పల్: వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసిన బెల్టు షాపులకు తరలిస్తుండగా సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన బెల్టు షాపుల నిర్వాహకులు షేక్ యాసిన్, షేక్ అజరత్ వలిగొండ రోడ్డులో ఉన్న ఎస్‌వీ వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.60వేలు ఉంటుందని సీఐ తెలిపారు. వారిద్దరితో పాటు వారికి మద్యం విక్రయించిన వైన్స్‌లోని క్యాషియర్ బొర్ర వెంకట్‌రెడ్డిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడులు

- ముగ్గురి అరెస్ట్
- పరారీలో మరికొందరు

మిర్యాలగూడ టౌన్: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్–దుబ్బతండా గ్రామ శివారులో గల గురుకుల పాఠశాల వెనుక భాగంలో చెట్ల కింద కోడి పందేలు ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న కటారి గోపికృష్ణ, మానిపాటి సుంకయ్య, ఎస్‌కే బడేసాహెబ్‌ను పట్టుకున్నామని, మరికొంత మంది అక్కడి నుంచి పరారయ్యారని ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి ఒక కోడి పుంజు, నాలుగు సెల్‌ఫోన్‌లు, ఒక ఆటో, రూ.2900 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ వివాదంలో మహిళపై దాడి

బొమ్మలరామారం: భూ వివాదంలో మహిళపై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండల పరిధిలోని మర్యాల గ్రామ పంచాయతీలో సోమవారం జరిగింది. స్థానిక ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మర్యాల గ్రామ పంచాయతీకి చెందిన మన్నె లలిత, మన్నె శ్రీధర్‌ల మధ్య భూమి పంచాయితీ జరుగుతోంది. ఆదివారం భూమి పంచాయితీకి సంబంధించి ఇరువురు మాట్లాడుతుండగా శ్రీధర్ లలితపై దాడి చేశాడు. దీంతో లలిత తలకు తీవ్ర గాయమైంది. బాధితురాలి కుమారుడు శ్యాం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే ఈ ఘటన ఆదివారం జరగడంతో పాత సెక్షన్‌ల ప్రకారమే కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన మొదటి రోజే పాత సెక్షన్‌లతో కేసు నమోదు కావడం కొసమెరుపు.

పంచాయతీ కార్యాలయంలో రికార్డులు సీజ్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం గాంధీనగర్‌తండా గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు రావడంపై సోమవారం ఎంపీఓ జగదీష్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకవర్గం నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో నిధుల వినియోగం, ఖర్చులు, సంబంధిత బిల్లులు, ఓచర్లు, మస్టర్లు, ఎంబీ రికార్డులు, తీర్మానాల రికార్డులను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సదరు రికార్డులను పరిశీలన నిమిత్తం ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. విచారణలో తాజా మాజీ సర్పంచ్ బి.అరుణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనితకుమారి, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.



గాంధీనగర్ తండాలోని గ్రామం పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీఓ జగదీష్

కారు ఢీకొని వలస కూలీ మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- మృతుడు ఛత్తీస్‌గడ్ వాసి



ప్రమాదానికి కారణమైన కారు



గజేంద్ర మృతదేహం



తీవ్రగాయాలపాలైన లచిన్

మునగాల(కోదాడ): నడుచుకుంటూ వెళ్తున్న వలస కూలీలను ఎదురుగా అతివేగంగా వచ్చి కారు ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మునగాల మండలంలోని తాడువాయి శివారులో జరిగింది. స్థానిక ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి వలస కూలీలు బోరు బండి మీద కూలీలుగా పనిచేస్తున్నారు. వారు బోరు బండిని మునగాల మండలం తాడువాయి శివారులోని భారత్ పెట్రోల్‌బంక్‌లో ఆదివారం రాత్రి ఉంచి అక్కడే బస చేశారు. సోమవారం ఉదయం బోరు బండిపై కూలీలుగా పనిచేస్తున్న గజేంద్ర(26), లచిన్ టీ తాగేందుకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ తాడువాయి గ్రామ స్టేజీ వద్దకు వెళ్లారు. టీ తాగి తిరిగి వస్తుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా అతివేగంగా వచ్చి వారిద్దరిని ఢీకొట్టి పక్కనే పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో గజేంద్ర అక్కడికక్కడే మృతిచెందగా.. లచిన్‌కి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం లచిన్‌ను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గజేంద్ర మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బోరు బండి యజమాని సూడి భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

గరిడేపల్లి: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన పెండెం నరేష్ (40)కు అతని భార్య పెండెం స్వప్నకు మధ్య గొడవలు జరుగుతుండడంతో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. జూన్ 19న భార్య స్వప్న, అత్తమామలు మేకపోతుల సైదులు, అంజమ్మ కలిసి నరేష్ ఇంటికి వెళ్లి విడాకుల నోటీసు మీద సంతకం పెట్టమని అతడిని కొట్టారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన నరేష్ మనస్తాపంతో ఆదివారం రాత్రి గ్రామ శివారులోని మామిటి చెట్టుకు మోటార్ కేబుల్ వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి పెండెం ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

- తాను ప్రేమించిన యువతి బంధువులు చంపుతామని బెదిరించడంతో ఉరేసుకుని ఆత్మహత్య

సూర్యాపేటటౌన్/చివ్వెంల: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి బంధువులు చంపుతామని బెదిరించడంతో మనస్తాపానికి గురై యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం సూర్యాపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన సుదగాని సురేందర్(26) సూర్యాపేట పట్టణంలోని ఓ బేకరిలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నవ్యతో సురేందర్ గత సంవత్సరకాలంగా ప్రేమలో ఉన్నారు. నవ్య కుటుంబ సభ్యులు గత పదిహేను సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే జీవనం సాగిస్తున్నారు. నవ్య వరంగల్‌లో పీజీ విద్యనభ్యసిస్తూ తిమ్మాపురంలో ఉన్న తమ బంధువుల ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లే క్రమంలో సురేందర్‌తో ప్రేమలో పడింది. ఇరువురు మేజర్‌లు కావడంతో ఆరు నెలల క్రితం రహస్యంగా వివాహం చేసుకొని సూర్యాపేటలోని జమ్మిగడ్డలో ఓ అద్దె గదిలో నివసిస్తున్నారు. జూన్ 27న సురేందర్‌తో వివాహం చేసుకున్నట్లు యువతి తన తల్లిదండ్రులతో చెప్పింది. ప్రేమ వివాహం ఇష్టం లేని ఆమె తల్లిదండ్రులు 28వ తేదీన చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. చివ్వెంల పోలీసులు సురేందర్, నవ్యను స్టేషన్‌కు పిలిపించారు. పోలీసుల సమక్షంలో తాము మేజర్లమని వివాహం చేసుకున్నామని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఇరువురు తిమ్మాపురం గ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు వీరబోయిన మల్లయ్య, లక్ష్మమ్మతో పాటు మరికొంత మంది కుటుంబ సభ్యులు సురేందర్ ఇంటికి వెళ్లి అతడి తల్లి రాములమ్మపై దాడి చేసి నవ్యను బలవంతంగా హైదరాబాద్ తీసుకెళ్లారు. దీంతో సురేందర్ కుటుంబ సభ్యులు చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సూర్యాపేట మండలం కేసారానికి గ్రామానికి చెందిన నవ్య మేనమామ వెంకన్న సురేందర్‌కు ఫోన్ చేసి చంపుతామని బెదిరించడంతో మనస్తాపానికి గురైన సురేందర్ సూర్యాపేటలోని జమ్మిగడ్డలో అద్దెకు ఉంటున్న గదిలో ఫ్యాన్‌కు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం మృతుడి తండ్రి సైదయ్య ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం కావడంతో సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలో అశ్రునయనాల మధ్య సురేందర్ అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి బెదిరింపులతో ఆత్మహత్యాయత్నం

చివ్వెంల(సూర్యాపేట): తనపై కొంతకాలంగా అత్యాచారానికి పాల్పడుతున్న యువకుడి బెదిరింపులతో మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన యువతి(19) తల్లి ఐదు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. యువతి చివ్వెంల మండల గుంజలూరు గ్రామానికి చెందిన తన మేనమామ ముత్తెన రామారావు వద్ద ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో గుంజలూరు గ్రామానికి చెందిన కొణకంచి మహేష్ ప్రేమ, పెళ్లి పేరుతో సదరు యువతికి మాయమాటలు చెప్పి కొన్నిరోజులుగా బలవంతంగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో యువతికి వివాహం చేసేందుకు ఆమె మేనమామ సంబంధాలు చూస్తుండగా.. వేరొకరిని పెళ్లి చేసుకుంటే తమ విషయం బయటపెడతానని మహేష్ యువతిని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది . ఇరుగు పొరుగు వారు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను సూర్యాపేటకు తరలించారు. యువతి మేనమామ ఫిర్యాదు మేరకు కోణకంచి మహేష్, అతనికి సహకరించిన పెద్దఅన్న, పంచాయితీ కార్యదర్శి కోణకంచి అశోక్, రెండవ సోదరుడు కోణకంచి అనిల్, తల్లి సత్యవతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



సుబ్బమ్మ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: బట్టలు ఉతుకుతుండగా సంపు మోటారు వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై వివాహిత మృతి చెందింది. ఈ ఘన యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరాయపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ ప్రహ్లాద తన కుమార్తె భూపతి సుబ్బమ్మ(25)ను రాజపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన సురేష్‌కి ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లోని లాలాపేటలో నివాసముంటున్నారు. సుబ్బమ్మ అక్కకి కొడుకు పుట్టడంతో బారసాల కార్యం కోసం ఆమె తన తల్లిగారి ఊరైన గౌరాయపల్లి గ్రామానికి మూడు రోజుల క్రితం వచ్చింది. సోమవారం ఉదయం 11గంటల సమయంలో ఇంటి ఆవరణలో బట్టలు ఉతుకుతుండగా సంపులో ఉన్న మోటారుకు సంబంధించిన వైరు ఆమెకు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ వైద్యులు పరీక్షించి సుబ్బమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.